క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి రూ.5లక్షల విరాళం



దాత సుబ్బారావును సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ రామలింగయ్య

హాలియా: మండల పరిధిలోని పేరూర్ గ్రామంలో గల స్వయంభూ సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మండలంలోని హజారిగూడెం గ్రామానికి చెందిన ఓబులేని సుబ్బారావు బుధవారం రూ.5,00,116 విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రాయనబోయిన రామలింగయ్య, కమిటీ సభ్యులు దాత ఓబులేని సుబ్బారావును శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ ఆంజనేయులు, సర్పంచ్ యడవెల్లి సుధారాణినాగరాజు, పూజారి మోహన్‌శర్మ, ఆలయ రికార్డు అసిస్టెంట్ సాంబయ్య తదితరులు ఉన్నారు.

ఆర్మీకి ఎంపికైన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న బట్టుగూడెం సర్పంచ్ లింగారెడ్డి

పెద్దవూర: ఆర్మీకి ఎంపికైన మండలంలోని బట్టుగూడెం గ్రామానికి చెందిన కత్తి రామకృష్ణారెడ్డి, రుద్రాక్షి మహేష్‌ను బుధవారం గ్రామ సర్పంచ్ చామకూరి చినలింగారెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి సేవ చేసే భాగ్యం రావడం అదృష్టంగా భావించాలని అన్నారు. ఇప్పటికే గ్రామానికి చెందిన పలువురు భారత సైన్యంలో పనిచేసి రిటైర్డ్ అయ్యారని, వీరిని ఆదర్శంగా తీసుకుని పలువురు యువకులు ఆర్మీలో ఉద్యోగం సాధించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చామకూరి రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయ కేసులో మహిళ అరెస్టు

మిర్యాలగూడ అర్బన్: సారా విక్రయ కేసులో మహిళను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు మిర్యాలగూడ ఎక్సైజ్ సీఐ నజీర్‌పాష తెలిపారు. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన పాలడుగు గీత గతేడాది నాటుసారా విక్రయిస్తూ పట్టుబడడంతో 2022 జూన్ నెలలో ఆమెపై కేసు నమోదు చేసి దామరచర్ల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని సీఐ పేర్కొన్నారు. తిరిగి 2022 డిసెంబర్‌లో మరోసారి ఆమె నాటుసారా విక్రయిస్తూ పట్టుబడంతో మళ్లీ కేసు నమోదు చేయగా, జరిమానా కట్టాలని ఆమెకు తహసీల్దార్ నోటీసులు పంపగా స్పందించలేదన్నారు. దీంతో ఉన్నతాధికారులు, తహసీల్దార్ ఆదేశాలతో సదరు మహిళను అరెస్టు చేసి నల్లగొండ జిల్లా జైలుకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

గజరాలతండాలో సీపీఐ ఆవిర్భావ వేడుకలు

డిండి: మండల పరిధిలోని గజరాలతండాలో బుధవారం నిర్వహించిన సీపీఐ ఆవిర్భావ వేడుకలకు పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు రమావత్ అంజయ్యనాయక్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి శైలేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రేకులు అందజేత

హాలియా: మండలంలోని మధారిగూడెం గ్రామానికి చెందిన షేక్ జానీ, మస్తాన్‌బీ దంపతులు శిథిలావస్థలో ఉన్న ఇంట్లో నివాసముంటూ ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఏకే ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన అనిల్‌కుమార్ బుధవారం ఆ వృద్ధ దంపతులు ఒక గది ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఆరు సిమెంట్ రేకులను అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అనుముల మండల మైనార్టీ సెక్రటరీ షేక్ జానీ, నాయకులు గౌస్, సైయ్యద్ జానీ, హఫీజ్, మునీర్, షేక్ కరీం, షేక్ అలీ, ఐతగోని మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల విక్రయానికి వేలం

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని కోదండాపురంలో గల పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల విక్రయ వేలం నిర్వహించారు. రూ.1,19,000లకు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి వెంకటాచారి దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్, కమిటీ సభ్యులు అంజిరెడ్డి, ఈదయ్య, అలివేలు, రాణివెంకటయ్య, సత్యనారాయణ, సైదిరెడ్డి, అజయ్, ఏకాంతరెడ్డి, పరమేష్, పాపయ్య పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని, రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు అన్నారు. మన బస్తీ–మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన పట్టణంలోని షాబునగర్(తాళ్లగడ్డ) ప్రాథమిక పాఠశాలతో పాటు మాడుగులపల్లి మండలం తోపుచర్ల ప్రాథమిక పాఠశాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మన ఊరు-మన బడి మొదటి విడతలో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ.28కోట్లతో ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులు వేగవంతంగా సాగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం పనులు పూర్తయిన పాఠశాలలను ప్రారంభించినట్లు తెలిపారు. పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు వీలుగా నియోజకవర్గానికి 28 పల్లె దవాఖానాలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం వచ్చేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. రెండు నెలలకు ఒకసారి తాను పాఠశాలలను తనిఖీ చేస్తానని అన్నారు. అనంతరం పాఠశాలలో మొక్కలు కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్‌రావు, పీఆర్ ఈఈ మాధవి, డీఈ వెంకటేశ్వర్‌రావు, మండల విద్యాశాఖాధికారి బాలాజీనాయక్, ఏఈ ఆదినారాయణ, స్థానిక కౌన్సిలర్ బంటు రమేష్, బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు బాసాని గిరి, ప్రధానోపాధ్యాయులు పి. సారయ్య, శ్రీవిద్యరాజు, హన్మంతరెడ్డి, మోసిన్ అలీ, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



షాబునగర్(తాళ్లగడ్డ) ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

‘మన ఊరు–మన బడి’తో మహర్దశ

● దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మన బడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మన ఊరు–మన బడి మొదటి విడుత కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గుడితండాలో రూ.6.03లక్షలతో అభివృద్ధి చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందన్నారు. అంతకుముందు ఆయన పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో రూ.25లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.21లక్షలతో చేపట్టిన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాళ్ల రేఖారెడ్డి, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, కేసాని లింగారెడ్డి, దస్రునాయక్, సర్పంచ్ అంజలీరాంబాబు, కళావతి, ఎంపీటీసీ రజిత, మేకల శ్రీనివాస్‌యాదవ్, బాలూనాయక్, తులసీరాం, లాలూనాయక్, వెంకటేష్, భీంసింగ్, రాములు తదితరులున్నారు.



గుడితండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పాఠశాల చిరునామా మార్చొద్దని ధర్నా

డిండి: మండల పరిధిలోని కందుకూర్ జెడ్పీహెచ్‌ఎస్ చిరునామా మార్చాలని కలెక్టర్ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకులు, విద్యార్థులు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట, హైదరాబాద్-శ్రీశైలం వెళ్లే హైవేపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా కందుకూర్ గ్రామపంచాయతీ నుంచి విడిపోయి శాంతిగూడెం నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటయ్యిందని, దీంతో గ్రామంలోని సర్వే నంబర్ 4 నుంచి 80 వరకు గల భూమి నూతనంగా ఏర్పడిన శాంతిగూడెం పంచాయతీ పరిధిలోకి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కందుకూర్ గ్రామం పేరుతో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ భవనం సర్వే నంబర్ 7లో ఉండడంతో శాంతిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌గా పేరు మార్చాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని అన్నారు. పాఠశాల చిరునామా మార్చొద్దని గత 15రోజుల నుంచి పాఠశాలకు తాళం వేసి, తరగతులు బహిష్కరించి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



డిండి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, అఖిలపక్ష నాయకులు

మీనాక్షి అగస్తేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని శ్రీమీనాక్షి అగస్తేశ్వర స్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త కొందూటి సిద్ధయ్య మాట్లాడుతూ.. శ్రీమీనాక్షి అగస్తేశ్వరస్వామి ఆలయంలో గత సంవత్సరం మార్చి నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు రూ.5,88,974 హుండీ ఆదాయం రాగా, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీని లెక్కించగా రూ.2,40,088 ఆదాయం వచ్చిందన్నారు. ఈ నెల 18న మహాశివరాత్రి సందర్భంగా ఆలయ ఆవరణలో పులిహోర, లడ్డు, కొబ్బరికాయల విక్రయానికి వేలం నిర్వహించగా లడ్డు, పులిహోర విక్రయాలను రూ.49,500కు నన్నపోయిన ప్రశాంత్ దక్కించుకున్నట్లు తెలిపారు. కొబ్బరికాయలకు గతం కంటే తక్కువ రావడంతో వేలం వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ మారెళ్ల రాంరెడ్డి, ధర్మకర్త బొడ్డు సాంబయ్య, శ్రీధర్, ఆలయ పూజారి రామానుధాచార్యులు, ఆలయ మేనేజర్ కొంకపాక మృత్యుంజయశాస్త్రి, మనోహర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, రంగా శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



మానవహారం నిర్వహిస్తున్న గుడిపల్లి మండల సాధన కమిటీ సభ్యులు

పెద్దఅడిశర్లపల్లి: ప్రస్తుతం గ్రామపంచాయతీగా ఉన్న గుడిపల్లిని మండలంగా ప్రకటించాలని కోరుతూ మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం 185 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మానవహారం నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గుడిపల్లి గ్రామపంచాయతీని మండలంగా చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి గుడిపల్లిని మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డపల్లి చంద్రారెడ్డి, చాట్లపల్లి రుక్మారెడ్డి, వట్టిపుగోవర్ధన్, రవీందర్‌రెడ్డి, అంజనేయులు, సైదులు, ఎర్ర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంపై కక్ష కట్టినట్లుగా బడ్జెట్ ఉంది: జూలకంటి

మిర్యాలగూడ అర్బన్: కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రంపై కక్ష కట్టినట్లుగా ఉందని, కేంద్రం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి రావాల్సిన వాటాను గణనీయంగా తగ్గించారని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ.. గత సంవత్సరం రాష్ట్రాల నుంచి వచ్చిన పన్నుల్లో తిరిగి 42శాతం తిరిగి ఇవ్వగా, తెలంగాణకు 21.33 శాతం మాత్రమే తిరిగి ఇస్తుందని, అది కూడా సకాలంలో ఇవ్వడంలేదని విమర్శించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో భారీగా కోత పెట్టారని, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వలేదన్నారు. ఉపాధి హామీ పథకానికి భారీగా నిధులు తగ్గాయని, ఆహార సబ్సిడీని 50శాతం తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు మాత్రం రూ.12లక్షల కోట్లు రుణాలు రద్దు చేశారని, కరోనా కాలంలో గ్రామాలకు తిరిగి వచ్చిన వలస కార్మికులకు ఉపాధి కల్పించకపోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ బడ్జెట్ పేదరికాన్ని రూపుమాపే విధంగా లేదని విమర్శించారు.

బీసీలకు బడ్జెట్‌లో 50శాతం నిధులు కేటాయించాలి

దేవరకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో బీసీలకు 50శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పున్న శైలజ డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు తగిన ప్రాధాన్యతనిస్తూ రిజర్వేషన్లు సైతం కేటాయించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు టికెట్లు కేటాయించాలని కోరారు. బడ్జెట్‌లో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కూడా అధిక మొత్తంలో ప్రభుత్వాలు నిధులు కేటాయించాలన్నారు.

బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి

పెద్దవూర: తెలంగాణ అసెంబ్లీలో ఈ నెల 6న ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయించాలని బీసీ యువజన సంఘం నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మోర మధుయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలను నిరాశపరిచిందని అన్నారు. ప్రజలపైన పెనుభారం మోపేలా కేంద్ర బడ్జెట్ ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ ప్రజల బడ్జెట్‌గా ఉండాలని పేర్కొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

● ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర: క్రీడల్లో, జీవితంలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని తుంగతూర్తి గ్రామంలో శ్రీపార్వతి సమేత స్వయంభూ సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి ప్రస్తుతం దేశస్థాయిలో మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్దవూర, తిరుమలగిరి ఎంపీపీలు చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, ఆంగోతు భగవాన్‌నాయక్, వెనిగండ్ల పీఏసీఎస్ చైర్మన్ కేవీ రామారావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్, సూర్యాపేట సీఐ ఆంజనేయులు, నడ్డి లింగయ్య, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గార్లపాటి శేఖర్, యాదమ్మ, రమావత్ రవినాయక్, పల్లెబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.



పెద్దవూర: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

క్యాలెండర్ ఆవిష్కరణ

దేవరకొండ: సీపీఎస్ ఉద్యోగుల సంఘం(టీఎస్ సీపీఎస్‌ఈయూ) నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ దేవరకొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో సీపీఎస్ రద్దు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శిరందాసు రామదాసు, రవికుమార్, మల్లేష్, చినముత్యాలు, సతీష్, పాండు, ప్రశాంత్, అనిల్ తదితరులున్నారు.

మౌలిక వసతులు కల్పిస్తేనే అభివృద్ధి సాధ్యం

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: ప్రతిఒక్కరికి మౌలిక వసతులు కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. అనంతరం సంఘం గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, బీఎం నాయుడు, రామ్మూర్తి, మంద రాజు, సైదులునాయక్, అలీమ్, నాగరాజు, నాగుల్‌మీరా, నగేష్, కోటేష్, సోముసుందర్ తదితరులున్నారు.

హక్కుల సాధనలో ఎస్‌ఎఫ్‌ఐదే కీలకపాత్ర

మిర్యాలగూడ: దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధనలో ఎస్‌ఎఫ్‌ఐ కీలకపాత్ర పోషిస్తుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో బుధవారం మూడో రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. నూతన విద్యా విధానం తీసుకొచ్చి విద్యను కాషాయీకరణ చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కేంద్రం చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు వినోద్‌నాయక్, పాపానాయక్, దయానంద్, కోటిరెడ్డి, ధీరావత్ శ్రీనునాయక్, ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కొర్ర సైదానాయక్, వదూద్, జగన్‌నాయక్, వీరన్న, సూర్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ అర్బన్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

కంటి వెలుగు శిబిరం పరిశీలన



జూనియర్ కళాశాలలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధి హిల్‌కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. 3, 4వార్డుల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇక్కడ కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

స్నేహితుడికి చేయూత



వెంకన్నకు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేస్తున్న స్నేహితులు

మిర్యాలగూడ అర్బన్: మాడుగులపల్లి మండల కేంద్రానికి చెందిన ఇండ్ల వెంకన్న గత కొన్ని సంవత్సరాలుగా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆక్సిజన్ కోసం ప్రతిసారి ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుండడంతో పాటు డబ్బులు భారీగా ఖర్చు అవుతున్నాయి. విషయం తెలుసుకున్న అతడి పదో తరగతి క్లాస్‌మేట్స్ బుధవారం రూ.లక్ష విలువ చేసే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌తో పాటు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జానకిరెడ్డి, జయదేవ్, మీసాల రాములు, చిలకరాజు శ్రీనివాస్, కొండకింద శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

‘చలితో వరికి పోషకాలు అందడంలేదు’

మిర్యాలగూడ అర్బన్: ప్రస్తుతం మండలంలో 41,264 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని, చలి కారణంగా వరి పొలాలకు పోషకాలు అందడంలేదని మండల వ్యవసాయ అధికారి బి. కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో వరి పొలాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషకాల లోపం నుంచి పంటను రక్షించుకోవడానికి సూక్ష్మపోషకాలు పిచికారీ చేయాలని సూచించారు. చలి వాతావరణం వలన అగ్గి తెగులు ప్రభావం ఎక్కువగా ఉన్నందున నివారణకు ట్రై సైక్లో జోల్ 120 గ్రాములు ఒక ఎకరాకు లేదా ఐసో ఆయోలిన్ 300 మిల్లీ లీటర్లు ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. అగ్గి తెగులు సోకిన పొలాల్లో నత్రజని సంబంధిత ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె. రమేష్, రైతు సమన్వయ సమితి సభ్యుడు పాలకూరి మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

కనుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

పెద్దవూర: మండలంలోని చలకుర్తి గ్రామంలో గల గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఎనిమిదో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తలంబ్రాలు తీసుకొచ్చి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవానికి హాజరైన అతిథులను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్, చెన్ను సుందర్‌రెడ్డి, పెద్దవూర సర్పంచ్ నడ్డి లింగయ్య, దేవాలయ ధర్మకర్త కొట్టె శ్రీను, గ్రామస్తులు కొట్టె సైదులు, గంగుల శ్రీనివాస్, కొట్టె గంగాధర్, వెంకటేష్, సతీష్‌గౌడ్, శ్రావణ్, కురాకుల సైదులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అతిథులను సన్మానిస్తున్న భక్తులు

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

హాలియా: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో నూతనంగా వెలిసిన గంగమ్మ తల్లి విగ్రహానికి బుధవారం యాదవ సంఘం పెద్ద గొల్ల నడ్డి రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు నల్లబోతు వెంకటయ్య, గౌనీ సుధారాణి, పిల్లి చంద్రకళ గంగమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద బోరు మోటారు ఏర్పాటుకు గాను జానపాటి శివయాదవ్, ధనలక్ష్మి దంపతులు రూ.30 వేలను విరాళం అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గౌనీ రాజారమేష్‌యాదవ్, చిలకల కాశి, మనాది రవీందర్, బూడిద గోవింద్, కోట్టె సైదులు, గంధం రామయ్య, కిలారి కృష్ణ, కొండల్, జవ్వాజి భిక్షం, రాజశేఖర్, సైదులు తదితరులు ఉన్నారు.



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న కౌన్సిలర్లు

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



హౌజింగ్‌బోర్డులో భీష్మ ఏకాదశి వేడుకల్లో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల శ్రీఅలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు కారంపూడి రాఘవాచార్యులు, కమలకుమారాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సూదిని వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చెన్నూరి వేణుగోపాల్‌రావు, గోదాటి నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కన్నెగండ్ల రంగయ్య, సహాయ కార్యదర్శి పోల శ్రీనివాస్, తీగల రమాదేవి, కార్యనిర్వహణ కార్యదర్శి కాసుల సత్యం, కోశాధికారి కోనేటి శ్రీనివాస్, ఎదవల్లి పద్మ, ఎర్రబెల్లి లక్ష్మి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

భాషా పండితుల డిమాండ్లు నెరవేర్చాలి

దేవరకొండ: భాషా పండితుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్రం(ఆర్‌యూపీపీటీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి మధు అన్నారు. బుధవారం దేవరకొండలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భాషా పండితులకు పదోన్నతులు కల్పించనందుకు గాను 9, 10వ తరగతి విద్యార్థులకు హిందీ, ఉర్దూ బోధన నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్, మోహన్, వెంకట్, ఖయ్యూం, గణేశ్, సత్యనారాయణ, వెంకట్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కేశవాపురం సర్పంచ్ మృతి



నాగార్జున్‌రెడ్డి (ఫైల్)

మిర్యాలగూడ: మాడ్గులపల్లి మండలం కేశవాపురం గ్రామ సర్పంచ్ నెర్మటి నాగార్జున్‌రెడ్డి (60) గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ బుధవారం తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మండలంలో కేశవాపురం నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఆయన సర్పంచ్‌గా గెలుపొందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంగన్‌వాడీ టీచర్లకు నియామక పత్రాలు అందజేత

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నియామకమైన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు సీడీపీఓ మమత ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పద్మ, రేవతి, మాధవి, రాధిక, లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

హాలియా: మండల కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వ సమీపంలో గల శ్రీశ్రీ గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి శివ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు బ్రహ్మశ్రీ గొట్టెముక్కల నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, మండపారాధన, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శివ వీరబ్రహేంద్ర స్వామి వారిని హాలియా పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌చారి, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి శంకరాచారి, నారోజు సత్తయ్యచారి, కల్వకుంట్ల కోటాచారి పాల్గొన్నారు.